క్లుప్తంగా

ఆధార్ సేవలు సద్విని యోగం చేసుకోండి



ఫొటో తీస్తున్న దృశ్యం

కోసిగి: ఆధార్ కార్డు సేవలు సద్వినియోగం చేసుకోవాలని చింతకుంట గ్రామ డిజిటల్ అసిస్టెంట్ కృష్ణ తెలిపారు. చింతకుంట గ్రామ సచివాలయంలో ఆధార్ కార్డు సేవలు నెల రోజులుగా అందిస్తున్నామని చెప్పారు. ఆధార్ కార్డులో పేర్లు , అడ్రస్, ఫోన్ నంబర్ల చేర్పులు, మార్పులు చేస్తున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



ఆదోని సెంట్రల్: ఆలూరు మండలం మొలగవల్లి గ్రామం రైల్వేగేట్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. మొలగవల్లి–నేమకల్లు అర్ఎస్ లైన్ మధ్య మొలగవల్లి అర్ఎస్ యార్డులో కిలోమీటర్ నంబర్.462/26–28 వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారీపడి మృతి చెందాడు. మృతుడు వయస్సు 65 సంవత్సారాలు ఉంటుందని, తెల్లని చొక్కా,పంచె ధరించాడు. చేతికి ఇత్తడి కడియం ఉంది. చొక్కాకు వెంకటేశ్ టైలర్, ఆలూరు లేబల్ ఉంది. డిప్యూటీ ఎస్ఎంఆర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ. రామస్వామి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ 91 8886454595 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆదోని నుంచి మచిలీపట్నానికి రైలు నడపండి

ఆదోని సెంట్రల్: ఆదోని నుంచి మచిలీపట్నానికి రైలు నడపాలని ప్రభుత్వ తల్లిదండ్రుల చిన్న పిల్లల అసుపత్రి మెంబర్ నసురుద్దీన్ పటేల్ బుధవారం కోరారు. రైలు నెంబర్ 07067–07068 మచిలీపట్నం నుంచి కర్నూలు మీదుగా మంత్రాలయం వరకు స్పెషల్ ట్రెన్‌ను నడుపుతున్నారన్నారు. మంత్రాలయం నుంచి ఆదోనికి 41 కి.లో. దూరం మాత్రమే ఉందన్నారు. ఆదోని నుంచి రైలు నడిపితే.. ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు అనేక మంది విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఆదోని నుంచి విజయవాడకు వెళ్లడానికి రైలు లేక పోవడంతో గుంతకల్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మచిలీపట్నం రైలును ఆదోని నుంచి నడపాలని విజ్ఞప్తి చేశారు.

అమృతవనం కోసం మట్టి సేకరణ

ఆదోనిఅర్బన్ : ఢిల్లీలో నిర్మించే అమృత వనం కోసం ఇంటింటి నుంచి మట్టి సేకరణ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు బుధవారం పట్టణంలో చేపట్టారు. మేరా మట్టి మేరా దేశ్ ' కార్యక్రమం ఇన్‌చార్జ్ దేవేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్ ఇంటింటికీ తిరిగి మట్టి సేకరించారు. వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో అమృత వనంను నిర్మించాలని ప్రధానమంత్రి మోదీ సంకల్పించారన్నారు.ఇందులో భాగంగా ఆదోని అసెంబ్లీ నుంచి కూడా ప్రతి గడప నుంచి చిటికెడు మట్టిని సేకరిస్తున్న చెప్పారు. పట్టణ అధ్యక్షుడు మహాదేవ్, ప్రధాన కార్యదర్శి ఉరుకుందగౌడ్, బాలాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం



నగదు అందిస్తున్న ట్రస్టుబోర్డు చైర్మన్

కౌతాళం: వైఎస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఉరుకుంద గ్రామానికి చెందిన మునయ్య గతంలో మృతి చెందాడు. నాడు మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా వర్తింపజేసి తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. ప్రస్తుతం మిగిలిన మొత్తం రూ.90వేలు నామిని అయిన మృతుడి భార్య లక్ష్మికి బుధవారం అందజేశారు. దీంతో ఆమె ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

9న ఐసీఈయూ శిక్షణ తరగతులు

కర్నూలు(అర్బన్): ఈనెల 9న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలోని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ శిక్షణ తరగతులను స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఆర్ సునీయకుమార్, డివిజన్ సంయుక్త కార్యదర్శి టీ రమేష్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ శిక్షణ తరగతులకు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పి.సతీష్, జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఏ.రఘునాథరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఇన్సూరెన్స్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.



కృష్ణుడు గోపికల వేషధారణలో విద్యార్థులు,



ఉట్టి కొడుతున్న కృష్ణుడు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



గోపికలతో కలసి ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణుడు,



కామవరంలో శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం,



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

కోసిగి: స్థానిక గీతామందిరం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి వేదపండితులు మూర్తి స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్పాలంకరణలు గావించి, మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే శ్రీకృష్ణుడికి భక్తుల మధ్య ఊంజల సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఎరిగేరి శ్రీనివాసులు, కొళ్లి రామకృష్ణ, బంగారు వెంకోబ, రంగస్వామి, డాక్టర్ హెచ్. గోపాల్ ,సాయి కుమార్ పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: పట్టణంలోని కిడ్డీస్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను బుదువారం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కౌతాళం: శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. కామవరంలో యాదవులు తమ కులదైవంగా శ్రీకృష్ణ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. అలాగే మండల కేంద్రంలో వివిధ పాఠశాలల్లో చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ఉట్టిగొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ఆదోని రూరల్ : ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ ప్రత్యేక సవరణ–2024కు సంబంధించి సమావేశం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని కోరారు. బూత్ లెవల్ ఆఫీసర్‌ల పనితీరు, వారి ఓటర్ సర్వే చేస్తున్న విధానాలపై చర్చిస్తామని చెప్పారు.

నేడు వేణుగోపాలస్వామి రథోత్సవం

ఆదోనిఅర్బన్ : స్థానిక కార్వన్‌పేట గోపాలకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా వేణుగోపాలస్వామి పదో రథోత్సవ వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో గోపూజ, 8 గంటలకు పంచామృతాభిషేకం, 9 గంటలకు తులసీ సహస్తనామార్చాన, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాలు చేపడతామన్నారు. సాయంత్రం 4 గంటలకు స్వామివారి రథోత్సవం, రాత్రి 10 గంటలకు భజన కార్యక్రమాలు, రాత్రి 12 గంటలకు జోల కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

వర్షపునీరు తొలగింపు

ఆదోనిఅర్బన్ : ఖాజీగడ్డ ఏరియాలో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతుండటాన్ని కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు కమిషనర్ రఘునాథ్‌రెడ్డి జేసీబీతో నీరు బయటకు పంపే పనులు చేయించారు.

ఉరుకుందకు తరలివస్తున్న భక్తులు





అన్వేటి మంఠం నుంచే స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, క్షేతానికి తరలివస్తున్న భక్త జనం

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా నాల్గవ గురువారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి బుధవారం నుంచే భక్తులు తరలివస్తున్నారు. దీంతో సాయంత్రం పాటికి క్షేత్రం పరిసరాలు నిండిపోయాయి. స్వామి వారిని దర్శించుకునే భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వీఐపీ క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి అనుమతించారు. గురువారం స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకోవడం ఆనవాయితీ. ముఖ్యంగా గురువారానికి ముందు రోజు క్షేత్రంలో నిద్ర చేయాలనే మొక్కులో భాగంగా భారీగా క్షేత్రానికి చేరుకుంటున్నారు. కోసిగి సీఐ ఏరిషావలి ఆధ్వర్యంలో కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్‌రెడ్డి, మరో నలుగురు ఎస్ఐలు, పోలీసులు, మహిళా పోలీసులతో బందోబస్తును నిర్వహిస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

పెద్దకడబూరు : అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న కోరారు. మండలంలోని కల్లుకుంట గ్రామ బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్నేళ్లుగా వర్షాకాలంలో ఇబ్బందులు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బుధవారం నిల్వ నీటిలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదన్నారు. నాయకులు శ్రీను, వీరన్న, హనుమంతు పాల్గొన్నారు.

ఉచితంగా గణనాథుని ప్రతిమలు

హొళగుంద: ఈ నెల 18న వినాయక పండుగను పురస్కరించుకుని భక్తులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయనున్నట్లు హొళగుంద సాయిబాబా మందిరం పూజారి శ్రీకాంత్ బుధవారం తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా భక్తులకు మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు సంకల్పించినట్లు వెల్లడించారు. భక్తులు హొళగుంద సాయిబాబా ఆలయం పక్కనున్న సాయితేజ వాటర్ ప్లాంట్‌లో సంప్రదించి మట్టి వినాయక విగ్రహాలను తీసుకెళ్లవచ్చన్నారు. వివరాలకు 95025 70229 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



బోయ నరసప్ప (ఫైల్)

దేవనకొండ: మండలకేంద్రానికి చెందిన కౌలు రైతు బోయ నరసప్ప (42) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. బోయ నరసప్ప గత ఆరేళ్ల నుంచి తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని ఉల్లి, పత్తి, మిరప మొదలైన పంటలను సాగుచేస్తూ జీవనం సాగించేవాడు. ప్రతి సంవత్సరం అతివృష్టి లేదా అనావృష్టి వల్ల పంటలు నష్టపోయి పెట్టిన పెట్టుబడి కూడా చేతికిరాక దాదాపు రూ.6 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేయగా మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడినుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం తెల్లవారజామున 5.02 గంటలకు నరసప్ప మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మిదేవి, ఇద్దరు కుమార్తెలు నరసమ్మ, ఇందు ఉన్నారు.

10 న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 10 న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా స్థాయి సీనియర్స్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ ప్రతినిధి దాదా బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 9985161007 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఈరన్న స్వామి పల్లకోత్సవానికి భారీ బందోబస్తు



కందుకూరులోని తుంగభద్ర నది ఒడ్డున ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఎస్పీ సీతారామయ్య, ఉరుకుంద ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు గౌడ

కోసిగి: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11వ తేదీన ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవానికి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య తెలిపారు. స్వామి వారి పల్లకీ రానున్న సందర్భంగా బుధవారం మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నది వద్ద ఏర్పాట్లపై ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ కమిటీ చైర్మెన్ నాగరాజు గౌడ, పాలక మండలి సభ్యులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ శ్రావణ మాస ఆఖరి సోమవారం 11న వేకువ జామున ఆలయం నుంచి స్వామి వారిని పల్లకీలో ఆశీనులు గావించి అక్కడ నుంచి తిమ్మాపురం, కామన్‌దొడ్డి, కందుకూరు గ్రామాల మీదుగా కందుకూరు పాత గ్రామం రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలోనున్న తుంగభద్ర నది ఒడ్డుకు పాదయాత్రగా చేరుకుంటారన్నారు. అక్కడ నదిలో స్వామి వారి ఉత్సవమూర్తికి పుణ్య స్నానాలు చేయించి దింపు కట్ట పై స్వామి వారి కొలువుంచి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి పల్లకీలో పాదయాత్రగా తిరిగి కందుకూరు గ్రామం మీదుగా కామన్‌దొడ్డి, కందుకూరు, తిప్పలదొడ్డి గ్రామాల మీదుగా ఉరుకుంద క్షేత్రాన్నికి చేరుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కోసిగి మండల కన్వీనర్ల బెట్టన గౌడ, ఆలయ సూపరిండెండెంట్‌లు రామ్మోహన్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, అర్చకులు మహాదేవ స్వామి, మల్లయ్య స్వామి, ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు మెంబర్లు మల్లికార్జున గౌడ, బుళ్లి నరసింహులు, కౌతాళం , పెద్దకడబూరు ఎస్ఐలు నరేంద్ర కుమార్ రెడ్డి, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

కారు ఢీకొని.. ముగ్గురికి గాయాలు



గాయపడిన కురువ భీరప్ప

ఆదోని రూరల్ : మండలంలోని ఆదోని–ఎమ్మిగనూరు రహదారిలోని నాగలాపురం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. తాలూకా హెడ్‌కానిస్టేబుల్ ఆనందరాజ్ తెలిపిన వివరాల మేరకు.. ఆదోనికి చెందిన కురువ భీరప్ప, రాధమ్మ, వారి కుమారుడితో కలిసి మోటార్ సైకిల్‌పై ఎమ్మిగనూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో కుమారుడుకి దాహం వేయగా నాగలాపురం క్రాస్ రోడ్డు సమీపంలో బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి నీళ్లు తాపుతుండగా.. ఏపీ04ఏఎక్స్ 0567 అనే నంబర్ గల కారు ఆదోని నుంచి కర్నూలు వైపు వెళ్తూ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో కురువ భీరప్ప, రాధమ్మ, వారి కుమారుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెప్పారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

హాలహర్వి: మండలంలోని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిసరాలు శుభ్రంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆంతోని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గూళ్యం గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్నతో కలిసి పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాల వల్ల పారిశుద్ధ్యం లోపించి, తాగునీరు కలుషితమై ఉండొచ్చని చెప్పారు. అతిసార వ్యాధితో ప్రజలకు విరేచనాలు ఏర్పడడం జరిగిందన్నారు. వెంటనే పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడి వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యసేవలు అందించినట్లు వివరించారు. అతిసారా వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చిందని, గ్రామంలో అతిసారా కేసులు జీరో అయ్యాయని చెప్పారు. ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. సమస్యలు ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ వెంట సర్పంచ్ ఉలిగమ్మ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు



కంబదహాల్‌లో ఎరువుల గోదామును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. మండలంలోని కంబదహాల్ గ్రామంలో బుధవారం ఆర్బీకేను పరిశీలించి ఎరువుల గోదామును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కంపెనీలు వేరైనా ఎరువులు ఒకటేనన్నారు. అన్నింటిలోనూ నిర్దేశించిన శాతం మూలకాలు ఉంటాయని చెప్పారు. రైతులు అనవసరంగా కొన్ని కంపెనీల ఎరువులపై మాత్రమే మోజు పెంచుకొని వాటినే కొనుగోలు చేస్తుండటంతో ఆయా కంపెనీలు ధరలు పెంచుతున్నాయన్నారు. ఇప్పుడు ఎరువులన్నీ కంపెనీలకు అతీతంగా 'భారత్' అనే పేరుమీద లభ్యమవుతున్నాయన్నారు. అనంతరం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు.

పంటల సాగు విధానాల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న డీపీఎం చంద్రశేఖర్, సిబ్బంది

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో రైతు మల్లికార్జున పొలంలో సాగుచేసిన ఏటీఎం మోడల్ పంటలను డీపీఎం చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, కన్సల్టెంట్ లక్ష్మయ్య, ఎన్ఎఫ్ఏ బుజేశ్వర్, పీపీటీ స్వాతి పరిశీలించారు. గ్రామంలో పర్యటించి పంటలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటీఎం మోడల్‌ను వేసుకోవడం వల్ల ముల్లంగి 30 రోజుల్లో, బీట్ రూట్ 60 రోజుల్లో, 90 రోజుల్లో క్యారెట్ దిగుబడులు చేతికి వస్తాయన్నారు. అదేవిధంగా ప్రతి సన్నకారు రైతు ఏటీఎం మోడల్ వేసుకోవడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అలాగే హుమయూన్ బాషా బీడుభూమిలో డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ చేపట్టినట్లు వివరించారు. ఈ మోడల్ వల్ల బీడు భూమిని సాగు భూమిగా మార్చుకోవచ్చన్నారు. ఎన్ఎఫ్ఎంటీ సుధాకర్, మోడల్ మేకర్ రంగస్వామి, మెంటర్ హుమయూన్‌బాషా, ఎల్–1 హుసేన్, ఐసీఆర్‌పీఎస్ ఫార్మర్, సైంటిస్టులు పాల్గొన్నారు.

హొళగుంద ఎంపీడీఓగా సుభాషిణమ్మ

హొళగుంద: హొళగుంద మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి (ఎంపీడీఓ)గా సుభాషిణమ్మను నియమించినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సత్యసాయి జిల్లాకు చెందిన ఈమె ఈఓపీఆర్‌డీగా పని చేసి పదోన్నతిపై హొళగుందకు బదిలీ అయినట్లు తెలిసింది. ఇప్పటివరకు ఆస్పరి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న రాధ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై హొళగుంద ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించారు. నూతన ఎంపీడీఓ సుభాషిణమ్మ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆస్తి వ్యవహారంలో మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గొల్లమానుపల్లిలో బుధవారం దారుణం చోటు చేసుకుంది. ఆస్తి తగాదాలో అక్క వెంకట లక్ష్మిని తమ్ముడు రంగారెడ్డి గ్రామస్తుల ముందే కాళ్లతో ఇష్టానుసారంగా తన్నాడు. దీంతో మనస్తాపం చెందిన అక్క పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు, బంధువులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గొల్లమానుపల్లికి చెందిన వెంకట లక్ష్మి, రంగారెడ్డి అక్కా తమ్ముడు. వీరి మధ్య కొంతకాలంగా ఆస్తి తగాదా కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం రంగారెడ్డి అక్క వెంకట లక్ష్మి ఇంటికెళ్లి ఆస్తి విషయంలో గొడవ పెట్టుకున్నాడు. మనస్తాపం చెందిన వెంకట లక్ష్మి పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గుత్తి కి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

9,10 తేదీల్లో రంగం రాష్ట్ర ప్రథమ మహాసభలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర ప్రథమ మహాసభలను ఈనెల 9, 10 తేదీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎ.కరుణాకర్ బాబు తెలిపారు. బుధవారం కళాక్షేత్రంలో మహా సభల పోస్టర్లు, టీషర్ట్‌లను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు కార్యక్రమ సమన్వయకర్త డి.జగన్నాథం, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు రంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర్ బాబు మాట్లాడుతూ రంగం ప్రజా సాంస్కృతిక వేదికను బలోపేతం చేయడం కోసం రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల ప్రతినిధులతో ప్రథమ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో వేదిక సహాయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సభ్యులు డాక్టర్ అమరేంద్రరెడ్డి, మోజెస్ పాల్గొన్నారు.

వేగంగా అదనపు గదుల నిర్మాణాలు

- నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం
- నియోజకవర్గంలో 169 గదుల నిర్మాణాలు
- రూ.4.92కోట్లతో పనులు



ఎస్ఎంహెచ్ పాఠశాలలో చేపడుతున్న గదుల నిర్మాణాలు

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రెండవ విడత కింద 108 పాఠశాలల్లో నాడు నేడు పనులతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. అందులో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కూడా రూ.98 లక్షలతో పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో ఎక్కడైతే విద్యార్థులకు తరగతి గదుల కొరత ఉందో గమనించి స్పెల్–1 కింద 41 పాఠశాలలో 169 అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో గది నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 లక్షలను వెచ్చిస్తోంది. మొత్తం 169 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.4.92 కోట్లు ఖర్చు చేస్తున్నారు. నాడు నేడు కింద ఎంపికైన పాఠశాలల్లో టెన్ కాంపోనెంట్స్ నిధులతో పాఠశాలలు మరమ్మత్తులు, విద్యుత్, వంటగది, టాయిలెట్స్ నిర్మాణాలు కాంపౌండు వాల్స్ వంటివి నిర్మాణాలు చేపడుతున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.8లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు మొదటి విడతలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని ఎంఈఓ బి. శివరాములు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గదుల నిర్మాణాల్లో ఆలస్యం చేకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న పనులు వేంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.